సాక్షి నిర్మల్

I

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025

గరిష్టం/కనిష్టం
28.4 /24.2

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

గంగమ్మ చెంతకు పోచమ్మ ఆభరణాలు



నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ఆభరణాల తరలింపుతో ప్రారంభమైంది. ఆలయ సేవాదారులు ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కాలినడకన గంగమ్మ చెంతకు తరలించారు.

- వివరాలు II లో▸

న్యూస్‌రీల్

ప్రజలకు చేరువయ్యేలా కమ్యూనిటీ బతుకమ్మ

- ఏఎస్పీ రాజేశ్ మీనా



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

ఖానాపూర్: ప్రజలకు మరింత చేరువయ్యేందుకే ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో కమ్యూనిటీ బతుకమ్మ కార్యక్రమం చేపట్టామని ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్ దుర్గామాత మండపం వద్ద శనివారం కమ్యూనిటీ బతుకమ్మ కార్యక్రమంలో మాట్లాడారు. కమ్యూనిటీ బతుకమ్మ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు మహిళల రక్షణపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పోక్సో చట్టంతోపాటు ర్యాష్ డ్రైవింగ్, మైనర్‌డ్రైవింగ్, లైగింక దాడుల నుంచి రక్షణ, సైబర్ నేరాల నియంత్రణ తదితర అంశాలను విషయాలు తెలియజేశారు. అంతకముందు దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళల బతుకమ్మ ఆటను వీక్షించారు. కార్యక్రమంలో సీఐ అజయ్, ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ఆర్జీయూకేటీలో ఆయుధపూజ



పూజా కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధికారులు..

బాసర: విజయదశమి వేడుకల్లో భాగంగా బాసర ఆర్జీయూకేటీలో వివిధ విభాగాల పరిశోధనలో శనివారం ఆయుధపూజ నిర్వహించారు. శాస్త్రోక్తంగా అర్చకులు కిశోర్ సరస్వతి, లక్ష్మి, మహాకాళి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాల ముందు ల్యాబ్ పరికరాలు, యంత్రాలపై పురోహితుడు పూజించి ఇచ్చిన అక్షతలను, జలాన్ని వాటిపై చల్లారు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ ఆయుధపూజ అనేది వ్యవసాయ ఉపకారణాలు, యంత్రాలు, వాహనాలు, కంప్యూటర్లు వంటి జీవితంలో అంతర్భాగమైన పరికరాలు, సాధనాలను పూజించడానికి అంకితం చేయబడినదన్నారు. యూనివర్సిటీలో ఉన్న భారీ యంత్రాలు నిరంతరం పనిచేస్తూనే ఉంటాయని, అందుకే శుభ్రం చేసి పూజ చేసినట్లు వెల్లడించారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ మాట్లాడుతూ సాధారణంగా ఆయుధపూజను నవమి నాడు జరుపుతారని, యూనివర్సిటీకి దసరా సెలవులు ప్రకటించినందున ముందస్తుగా నిర్వహించామని తెలిపారు.

'కడెం' రెండు గేట్లు ఎత్తివేత



కడెం: జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు అయిన కడెంకు శనివారం వరద పోటెత్తింది. 10,864 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు వరద గేట్లు ఎత్తి ఎత్తి 10,331 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.200 అడుగులు ఉంది.

'గడ్డెన్నవాగు'కు కొనసాగుతున్న వరద

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుతోంది. శనివారం 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్టు అధికారులు రెండు గేట్లు ఎత్తి 13,116 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.40 మీటర్లు కొనసాగిస్తున్నారు.

'స్వర్ణ' రెండు గేట్లు ఓపెన్

సారంగాపూర్: మండలంలోని ఆయా గ్రామాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు కాగా, ఉదయం ప్రాజెక్టులోకి 2,400ల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. సాయంత్రానికి 4,500లకు పెరిగింది. దీంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి 8,505 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఎల్లలు దాటిన బతుకమ్మ!

- వివరాలు II లో▸

గిట్లయిపాయె..



'అయ్యో బాపూ.. గిట్లయి పాయెనేమే..! ఎట్లన్న ఈసారి మనం పోటీల ఉంటమనుకున్నం. ఏడాదిసంది అటు పార్టీకి, ఇటు మనోళ్లకు అన్నీ చేస్తున్నం. కని.. గిట్లయితదని అనుకోలేదే..'అని దగ్గరి కార్యకర్తలు అంటుంటే.. 'ఏంజేస్తంరా.. మనచేతుల పనా.. రిజర్వేషన్ కలిసి రాక పాయె. అన్నీ మనం అనుకున్నట్లు అయితయా..! ఏందంటే.. ఈసారి జెడ్పీటీసీగ చేద్దమనుకున్నం..'అని ఆశావహ నేతలు నిరాశ చెందుతున్నారు. మరోవైపు పరిషత్ రిజర్వేషన్ కలిసి వచ్చిన నాయకులు సంబురపడుతూ ఇక అభ్యర్థిత్వం ఖరారు చేసుకునే ప్రయత్నాలు మొదలుపెడుతున్నారు. సగానికిపైగా స్థానాలు మహిళలకే దక్కనుండటంతో ఆ దిశగా ఎవరిని బరిలో దించాలనే దానిపై ఇళ్లల్లోనూ మంతనాలు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ల లెక్కతేలడంతో గ్రామాల్లోనూ ఇదే చర్చ జోరుగా సాగుతోంది. - నిర్మల్

- నేతల్లో రిజర్వేషన్.. పరేషాన్..
- కలిసొచ్చిన వారి ఇళ్లల్లో సందడి
- అభ్యర్థిత్వం ఖరారు కోసం యత్నాలు
- కలిసిరానివారిలో నైరాశ్యం

పరిషత్ పోరులో బరిలోకి దిగుదామనుకున్న పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, తమ కుటుంబసభ్యులను రాజకీయ అరంగేట్రం చేయిద్దామనుకున్న పలువురు సీనియర్ నేతలకు రిజర్వేషన్లు బ్రేక్ వేశాయి. రాజకీయ వారసత్వాన్ని ఈ ఎన్నికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావించిన పలువురు పెద్దలకు చుక్కెదురైంది. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలో ఒకరిద్దరికి మినహా చాలామంది సీనియర్లకు రిజర్వేషన్లు కలిసి రాలేదు. గత ఎన్నికల్లో చేతులారా జెడ్పీచైర్‌పర్సన్ పదవిని జారవిడుచుకున్న సీనియర్ బీసీనేతకు మాత్రం నిర్మల్‌రూరల్ కలిసివచ్చింది. ఎలాగూ మహిళ రిజర్వేషన్ వస్తుందన్న అంచనాతో వారసురాళ్లను రంగంలోకి దింపాలనుకున్న సీనియర్లకు దాదాపు నిరాశే ఎదురైంది.

అభ్యర్థిత్వం ఖరారు కోసం..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఇక అభ్యర్థిత్వం ఖరారు చేసుకునేందుకు ఆశావహులు సమాయత్తమవుతున్నారు. రిజర్వేషన్ తమకు అనుకూలంగా వచ్చిన మండల నేతలు ఇప్పటికే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకునే దిశగా పావులు కదుపుతున్నారు. తమ పార్టీల పెద్దలను మచ్చిక చేసుకునే పని మొదలుపెట్టారు. 'అన్న.. ఈసారి రిజర్వేషన్ మన సైడే వచ్చిందన్న.. జర ఇప్పుడైన మమ్మల్ని సూడాలిగ..' అంటూ తమ అభ్యర్థిత్వాన్ని ముందు పెడుతున్నారు. తమ ఓటుబ్యాంకు, పరపతి, కులం లెక్కలన్నీ ముందే వేసుకుని తమకే అవకాశం దక్కేలా చూసుకుంటున్నారు.

బరిలో ఎవరు..

మహిళ రిజర్వేషన్లు వచ్చిన స్థానాల్లోనే పోటీ ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. సగం స్థానాలతోపాటు మిగిలిన జనరల్ స్థానాల్లోనూ పోటీచేసే అవకాశం ఉండటంతో ఈసారీ పరిషత్ పోరులో మహిళలదే ఆధిపత్యం కనిపిస్తోంది. మహిళ రిజర్వేషన్ వచ్చిన స్థానాల్లో ఎవరిని బరిలో నిలుపాలనే దానిపైనా చర్చలు మొదలయ్యాయి. మండల స్థాయిలో కార్యకర్తలతోపాటు ఇంట్లో అమ్మానాన్నలు, భార్యాపిల్లలు, దగ్గరి బంధువులతోనూ అప్పుడే మంతనాలు మొదలుపెట్టారు. అమ్మను పోటీ చేయించాలా, భార్యను బరిలో దింపాలా, లేక చదువుకున్న బిడ్డనే అభ్యర్థిగా నిలుపాలా.. అన్న ఆలోచనలకూ పదునుపెడుతున్నారు.

'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు



లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్లు ప్రకటిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ఖరారుకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, జనరల్ రిజర్వేషన్లు ఖరారు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. జిల్లాలోని 18 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లను 2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ వాటాలను నిర్ణయించగా, బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం కేటాయించామన్నారు. మొత్తం ప్రక్రియ వీడియో రికార్డింగ్ మధ్యన, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని తెలిపారు. ఈ లక్కీడ్రా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డిప్యూటీ సీఈవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పీఠం బీసీలదే

జిల్లాపరిషత్ పీఠాల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ రూరల్ ఎంపవర్మెంట్ శాఖ శనివారం విడుదల చేసింది. నిర్మల్ జెడ్పీ పీఠం ఈసారి బీసీలకే దక్కనుంది. బీసీ(పురుష/మహిళ)కు రిజర్వు చేస్తూ పంచాయతీరాజ్ రూరల్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ అండ్ స్టేట్ ఎలక్షన్ అథారిటీ జి.శ్రీజన ఉత్తర్వులు జారీ చేశారు. 2019 నుంచి 2024 వరకు నిర్మల్ జెడ్పీ పీఠం జనరల్ మహిళకు కేటాయించారు. ఈసారి బీసీలకు అవకాశం దక్కనుంది.

జెడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లు ఇలా

మండలం	జెడ్పీటీసీ	ఎంపీపీ	మండలం	జెడ్పీటీసీ	ఎంపీపీ
బాసర	బీసీ(ఉమెన్)	ఎస్సీ జనరల్	నర్సాపూర్(జి)	బీసీ ఉమెన్	బీసీ జనరల్
తానూర్	ఎస్సీ జనరల్	జనరల్	లోకేశ్వరం	బీసీ జనరల్	బీసీ జనరల్
భైంసా	ఎస్సీ ఉమెన్	ఎస్సీ ఉమెన్	సారంగాపూర్	ఎస్టీ ఉమెన్	ఎస్టీ జనరల్
లక్ష్మణచాంద	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్	దస్తురాబాద్	బీసీ జనరల్	బీసీ ఉమెన్
సోన్	బీసీ ఉమెన్	బీసీ జనరల్	కుభీర్	జనరల్	ఎస్టీ జనరల్
కుంటాల	బీసీ జనరల్	జనరల్ ఉమెన్	దిలావర్‌పూర్	జనరల్ ఉమెన్	బీసీ జనరల్
నిర్మల్ రూరల్	బీసీ జనరల్	బీసీ ఉమెన్	కడెం	ఎస్టీ జనరల్	ఎస్టీ ఉమెన్
ముథోల్	బీసీ ఉమెన్	బీసీ ఉమెన్	మామడ	జనరల్	జనరల్
ఖానాపూర్	ఎస్టీ జనరల్	బీసీ ఉమెన్	పెంబి	జనరల్ ఉమెన్	జనరల్ ఉమెన్

లైటింగ్‌తో కొత్తశోభ

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ప్రాజెక్టుపై లైటింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: స్వర్ణ ప్రాజెక్టు వద్ద లైటింగ్ పునరుద్ధరణతో కొత్తశోభ సంతరించుకుందని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వర్ణ ప్రాజెక్టుపై రూ.32.70 లక్షల వ్యయంతో చేపట్టిన లైటింగ్ పునరుద్ధరణ పనులను శనివారం ప్రారంభించారు. గతంలో ప్రాజెక్టు పూర్తిగా నిండి గేట్లు ఎత్తిన క్రమంలో జౌళి గ్రామ ప్రజలు తమ గ్రామానికి రాత్రివేళ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. కేవలం ప్రాజెక్టు వద్ద మాత్రమే లైట్లు ఉండేవని ఆనకట్ట పొడవునా, ఆనకట్టు కిందగల జౌళి రహదారి పక్కన మొత్తం చీకటి అలుముకునేదన్నారు. అందుకే లైట్ల పునరుద్ధరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ప్రస్తుతం ప్రాజెక్టు పరిస్థితి, నీటి విడుదల విషయంలో గేట్ల పరిస్థితిని గురించి ఈఈ అనిల్, ఎస్ఈ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీటి వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. ఇంకా వర్షాల ప్రభావం ఉండడంతో ఎప్పటికప్పుడు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, బీజేపీ నాయకులు రావులరాంనాథ్, సత్యనారాయణగౌడ్, నాయకులు మంతెన గంగారెడ్డి, నరేశ్, చంద్రప్రకాశ్‌గౌడ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాసరలో కొనసాగుతున్న శరన్నవరాత్రి వేడుకలు



అక్షర శ్రీకారం చేయిస్తున్న తల్లిదండ్రులు..



సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులు

బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతీ ఆలయంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం 6వ రోజు అమ్మవారు 'కాత్యాయనీ దేవి' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాలుగు భుజాలతో సింహ వాహిణియై ఎడమ చేతుల్లో ఖడ్గం/తాళపత్ర నిధి మరో చేతిలో పద్మం, కుడి చేతుల్లో అభయముద్ర వరదముద్ర కలిగి భక్తులను అనుగ్రహిస్తోంది. ఆలయ వైదికబృందం అమ్మవారికి చతుషష్టి ఉపచార, మల్లెపుష్పార్చన పూజలు నిర్వహించి రవ్వ కేసరిని నైవేద్యంగా నివేదించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పిల్లలకు అక్షర శ్రీకారం చేయించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు...

ఉత్సవాల్లో భాగంగా కోటి గాజుల మండపంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. హైదరాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాందేడ్, పర్బని జిల్లాల కళాకారులు పాల్గొంటున్నారు. అమైర అనే చిన్నారి దాదాపు గంటపాటు ప్రదర్శించిన అద్భుతమైన కూచిపూడి, భరతనాట్యం నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వేతనాల కోసం లేఖలు

- సీఎంకు డిగ్రీ అతిథి అధ్యాపకుల వినతి
- రిజిస్టర్ పోస్టుల ద్వారా విజ్ఞాపనపత్రాలు



రిజిస్టర్ పోస్టు ద్వారా వినతిపత్రాలను సీఎంకు పంపుతున్న అతిథిఅధ్యాపకులు

నిర్మల్‌ఖిల్లా: డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న తమకు ప్రతినెలా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీరియడ్ల వారీగా ప్రతీనెల రావాల్సిన కనీస వేతనం రూ.28 వేలు సైతం సమయానికి చెల్లించలేకపోవడంతో పండగలు జరుపుకునే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకులు వేతనాలు ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. 12 నెలల కాలానికి వేతనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో లేఖలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించారు. అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, జిల్లా అధ్యక్షుడు సురేందర్, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పండుగ చేసుకునేదెలా?

- రెండు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్మికులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

లక్ష్మణచాంద: బతుకమ్మ, దసరా తెలంగాణ ప్రజలకు పెద్ద పండుగ. ఈ పండుగను అందరూ ఘనంగా జరుపుకుంటారు. అయితే పల్లె ప్రజలకు ఏడాది పొడుగునా ఉపాధి కల్పించి, వారు చేపట్టే పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తూ, సకాలంలో వేతనాలు అందేలా చేయడంలో వివిధ స్థాయిల సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. అయితే, సిబ్బందికి మాత్రం రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పండుగ వేళ ఇబ్బంది పడుతున్నారు. వివిధ స్థాయిలలో పని చేస్తున్న క్షేత్ర సహాయకుల(ఎఫ్ఏలు)కు జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు ఇంకా అందలేదు. టీఏలు, టీసీలు, ఏపీవోలకు ఆగస్టు నెలకు సంబంధించిన వేతనం రావాల్సి ఉంది. మూడవ నెల చివరికి వచ్చినా నెలనెలా రావాల్సిన వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పండుగకు పస్తులేనా?

హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో దసరా ఒకటి. దసరా పండుగ వచ్చేసరికి ధనిక, పేద, మధ్యతరగతి అనే తేడా లేకుండా, ఎవరి ఆర్థిక స్తోమతకు తగినట్లుగా కుటుంబ సభ్యులకు కొత్త బట్టలు కొనుగోలు చేసుకుంటారు. కానీ, ఉపాధి హామీ పథకంలోని సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 373 మంది సిబ్బంది

జిల్లాలోని 18 మండలాల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 12 మంది ఏపీవోలు, 5 మంది ఈసీలు, 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 72 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 207 మంది క్షేత్ర సహాయకులు, 18 మంది ఆఫీస్ సబార్డినేట్లు, 21 మంది డీఆర్డీఏ కార్యాలయ సిబ్బంది ఇలా మొత్తం 373 మంది విధులు నిర్వహిస్తున్నారు.

పంచాయతీ కార్మికులదీ ఇదే పరిస్థితి..

గ్రామాలను స్వచ్ఛంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల పాత్ర వెలకట్టలేనిది. జిల్లాలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా రెండు నెలలుగా వేతనాలు రావడం లేదు. జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటి వరకు రాలేదని, దీంతో దసరా పండుగను ఎలా జరుపుకోవాలని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 400 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,520 మంది కార్మికులు పని చేస్తున్నారు. వేతనాలు రాకపోతే పండుగకు పస్తులు ఉండాల్సి వస్తుందని కార్మికులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలోని 400 గ్రామ పంచాయతీల కార్మికులకు జూలై, ఆగస్టు నెలల వేతనాల కోసం ఇది వరకే ప్రభుత్వంకు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఖాతాల్లో జమ చేస్తాం. - శ్రీనివాస్, డీపీవో, నిర్మల్

ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది

ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేయగానే వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. - నాగవర్ధన్, ఏపీడీ ఉపాధిహామీ పథకం

కొత్త బట్టలు ఎలా కొనాలి



దసరా పండుగ దగ్గరకు వచ్చింది. చుట్టు పక్కల వారు తమ పిల్లలకు కొత్త బట్టలు కొనుగోలు చేయడంతో మా పిల్లలు మాకు ఎప్పుడు కొంటారు అని అడుగుతున్నారు. వారికి ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. - రాములు, ఎఫ్ఏ, వద్యాల్

పండుగకు పస్తులే..



రెండు నెలలుగా వేతనాలు లేవు. మూడోనెల కూడా పూర్తికావస్తుంది. జీతం డబ్బులు రాకుంటే కుటుంబ మంతా పస్తులు ఉండాలి. ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలి. - ఉదయ్ కిరణ్, పంచాయతీ కార్మికుడు, పీచర

వెంటనే విడుదల చేయాలి



ఉపాదిహామీ పథకంలో పని చేస్తున్న ఎఫ్ఏలకు రెండు నెలలు, ఇతర సిబ్బందికి ఒక నెల వేతనాలు రాలేదు. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేసి పండుగ జరుపుకునేలా చూడాలి. - రమణగౌడ్, టీఏ, తానూర్

జాతరకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ జానకీ షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

దిలావర్‌పూర్: అడెల్లి మహా పోచమ్మ (గంగనీళ్ల) జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల తెలిపారు. సాంగ్వి గ్రామంలోని పోచమ్మ ఆలయాన్ని శనివారం సందర్శించి పూజలు చేశారు. గోదావరి తీరాన్ని పరిశీలించారు. పోలీసులతో ప్రత్యేకంగా సమావేశమై సూచనలు చేశారు. ఆదివారం అమ్మవారి ఆభరణాలు అడెల్లి ఆలయానికి వెళ్లేమార్గంలో ఎలాంటి సమస్య రాకుండా చూడాలన్నారు. అమ్మవారి ఆభరణాలు ఎత్తుకునేందుకు పోలీసులు ప్రయత్నించవద్దని సూచించారు. ఏఎస్పీ రాజేశ్ మీనా, సోన్ సీఐ గోర్ధన్‌రెడ్డి, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు నాయకులు



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు జిల్లాలో శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో పలువురు అధికారులు కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్రోద్యమం, నిజాం వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నిర్మల్ పట్టణంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఖానాపూర్ పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని నివాళులర్పించారు.

ఎల్లలు దాటిన బతుకమ్మ



డల్లాస్ ఎలెన్ స్టేడియంలో బతుకమ్మ ఆడుతున్న తెలుగు మహిళలు

- విదేశాల్లోనూ ఘనంగా సంబురాలు
- మన సంస్కృతికిని కొనసాగిస్తున్న ఆడపడుచులు
- భాగస్వాములవుతున్న విదేశీయులు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబురాలు ఎల్లలు దాటాయి. ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా పూలపండుగను వైభవంగా జరుపుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది విదేశాల్లో నివసిస్తున్న ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మను తీర్చిదిద్ది పాటలు పాడుతూ ఆడుతున్నారు. ఈనేపథ్యంలో విదేశాల్లో ఉంటున్న మహిళలతో బతుకమ్మ తీరు తెన్నులపై 'సాక్షి' సెల్‌ఫోన్‌లో పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. – మంచిర్యాల అర్బన్

అట్టహాసంగా వేడుకలు



మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన మేము తొమ్మిదేళ్ల క్రితం నాభర్త విజయ్‌కుమార్ ఉద్యోగరీత్యా అమెరికాకు వచ్చాం. మొదట్లో బోస్టన్‌లో ప్రస్తుతం జార్జియా (అట్లాంటా) కమింగ్‌లో ఉంటున్నాం. బతుకమ్మను ఇక్కడ తీరొక్కపూలతో పేర్చుతాం. బతుకమ్మ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నాం. లోరింగ్ కమ్యూనిటీ వాళ్లందరం (200 నుంచి 250) మంది ఒకచోట చేరి వేడుకలు జరుపుకుంటాం. మొదటిరోజు, చివరిరోజు నిర్వహించే ఉత్సవాలు ఎంతో ఘనంగా ఉంటాయి. స్కూల్‌లో మైదానంలో ఒక్కో ఆసోసియేషన్ ఒక్కోరోజు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుంటాయి. – శృతి, అట్లాంటా

తెలంగాణలో మాదిరిగానే..



మంచిర్యాలఅర్బన్:మాది మంచిర్యాల. వివాహమైన తర్వాత నాభర్త కార్తీక్‌తో కలిసి నాలుగేళ్ల క్రితం అమెరికాలోని అట్లాంటా(జార్జియా)కు వచ్చాం. తెలంగాణ మాదిరిగానే అమెరికాలో బతుకమ్మ ఉత్సవాలు సాగుతున్నాయి. బతుకమ్మ పేర్చుతాం. గౌరమ్మ పెట్టి పూజిస్తాం. ప్రసాదాలు నైవేద్యాలు సమర్పిస్తాం. వేడుకలు ముగియగానే ప్రసాదాలు ఒకరికొకరు ఇచ్చుకుంటాం. ముందుగా సెల్‌ఫోన్ గ్రూపులో అనుకున్న మాదిరిగా ప్రతిఒక్కరూ ఫుడ్ ఒక్కో తీరుగా తయారు చేసుకుని వస్తాం. 40 నుంచి 50 మంది గ్రూపు సభ్యులం కలిసి సామూహిక భోజనం చేస్తాం. దాండియా ఆడుతాం. నవరాత్రులు పూజలు చేస్తాం. మహా బతుకమ్మ (చివరి రోజున) 5 నుంచి 6 గంటల పాటు నిర్వహించనున్న వేడుకలకు ప్రతిఒక్కరూ హాజరవుతారు. పీడీఎఫ్ చూసుకుంటూ బతుకమ్మ పాటలు పాడుతాం. – గణపురం మౌనిక, అట్లాంటా

ఆ సందడే వేరు..



మంచిర్యాలఅర్బన్:మాది మంచిర్యాల. పదిహేనేళ్ల క్రితం నాభర్త ఉద్యోగ రీత్యా అమెరికాకు వచ్చాం. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఇక్కడ ఆ సందడే వేరు. ఇక్కడ గునుగు, తంగేడు పూలు దొరకవు. ఇంట్లో పూలు, మార్కెట్లో దొరికే చామంతి, పలురకాల పూలతో బతుకమ్మ పేర్చుతాం. విధుల్లో ఎంత బిజీగా ఉన్నా సరే గ్లోబల్ తెలంగాణ ఆసోసియేషన్, గ్రేటర్ అట్లాంటా తెలంగాణ ఆసోసియేషన్ (గేట్స్) ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటాం. ఇక్కడ వీకెండ్‌లో స్కూల్ మైదానంలో మాత్రమే వేడుకలు జరుగుతాయి. బతుకమ్మ సెలబ్రేషన్‌కు ముందు వలంటీర్లు, పెద్దవాళ్లు పిల్ల లకు బతుకమ్మ పేర్చడం నేర్పిస్తారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఘనంగా జరుపుకుంటాం. – అనుహ్య శరత్‌క్రిష్ణ, అమెరికా

సంప్రదాయాలు పాటిస్తాం



బెల్లంపల్లి: పదిహేనేళ్ల నుంచి అమెరికాలో ఉంటూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాను. ఏటా క్రమం తప్పకుండా బతుకమ్మ పండుగను మేము ప్రాంతంలో సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నాం. ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లకు ప్రాధాన్యత ఇస్తూ తంగేడు పూలు తప్పా ప్రకృతిలో పూసిన పూలతో బతుకమ్మను పేర్చి రోజువారీగా ఆడుతున్నాం. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారంతా ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉంది. బతుకమ్మ చుట్టూరా తిరుగుతూ పాటలకు లయబద్ధంగా నృత్యం చేస్తూ కోలాటం ఆడుతున్నాం. పూల పండుగను అమెరికాలో జరుపుకున్నా సొంతూరిలో ఉన్నట్లే అనిపిస్తుంది. బతుకమ్మను ఎన్నడూ మర్చిపోలేం. – కటకం లావణ్య, స్పిట్స్‌బర్గ్, అమెరికా

దశాబ్దకాలంగా విదేశాల్లోనే..



ఖానాపూర్: దశాబ్ద కాలంగా విదేశాల్లోనే ఉంటూ ఇక్కడే తెలంగాణ ప్రజలతో కలిసి దసరా, బతుకమ్మ ఉత్సవాలు జరుపుకుంటున్నాం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన నా భర్త పన్నెల జనార్దన్ జానపద కళాకారుడు. ఈ ప్రాంతంలోని తెలంగాణ ప్రజలను ఉత్సవాలపై చైతన్యపరుస్తున్నాడు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా ప్రజలను చైతన్యపరుస్తూ సంప్రదాయబద్ధంగా పూల పండుగ, ఇతర ఉత్సవాల్లో పాల్గొంటున్నాం. – పన్నెల రూప జనార్దన్, ఎన్ఆర్ఐ

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా..



ఖానాపూర్: ఓమన్ (మస్కట్)లో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఏటా సంబురంగా జరుపుకుంటాం. నా భర్త గుండేటి గణేశ్ ఇండియన్ సోషల్ క్లబ్ ఒమన్ అధ్యక్షుడు. ఆయన చొరవతో కొన్నేళ్లుగా ఇక్కడ ఉత్సవాలు జరుపుకుంటున్నాం. ఈ ప్రాంతంలోని తెలంగాణ మహిళలంతా పాల్గొని కార్యక్రమం జయప్రదం చేస్తున్నారు. తెలంగాణలోని బతుకమ్మ పండుగ ఉట్టిపడేలా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. – గుండేటి సంధ్య గణేశ్

ఐక్యత చాటే పండుగ



మంచిర్యాలఅర్బన్: నాపేరు సుచిత. నాభర్త సాయికిరణ్ ఉద్యోగ రీత్యా ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్‌లో ఉంటున్నాం. ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలకు మా అత్తగారి ఊరైన మంచిర్యాలకు వచ్చాను. ఐక్యతను చాటే పండుగ. అందరూ ఒకే చోట చేరి చప్పట్లు కొడుతూ పాటలు పాడడం మరువలేని అనుభూతి. – సంగార్పు సుచిత

తప్పనిసరిగా వస్తాం..



మంచిర్యాలఅర్బన్: నాపేరు ప్రసూన. 40 ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా మా ఆయన సత్యనారాయణరావుతో కలిసి టెక్సాస్‌లో ఉంటున్నాం. నలుగురు పిల్లలు కూడా అక్కడే స్థిరపడ్డారు. 2010 నుంచి బతుకమ్మ పండుగకు తప్పనిసరిగా లక్సెట్టిపేటకు వస్తాం. కుటుంబసభ్యులతో కలిసి మా ఇంట్లోనే బతుకమ్మ వేడుకలు జరుపుకుంటాం. – గూడూరు ప్రసూన

28 ఏళ్లుగా ఆడుతున్నాం



చెన్నూర్: చెన్నూర్ నుంచి 28 ఏళ్లక్రితం డల్లాస్‌కు వచ్చాం. అప్పటి నుంచే బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నాం. తొమ్మిది రోజులు అపార్ట్‌మెంట్‌లలో బతుకమ్మ ఆడుతాం. సద్దుల బతుకమ్మ మాత్రం ఎలెన్ స్టేడియంలో నిర్వహిస్తాం. డల్లాస్‌లో ఉన్న వాళ్లే కాకుండా వివిధ ప్రాంతాల్లో ఉండే తెలుగు వాళ్లంతా అక్కడికి వచ్చి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. మన బతుకమ్మ పాటలు, మన సంప్రదాయం ప్రకారం వాయినాలు ఇచ్చుకుంటాం. సద్దుల బతుకమ్మ రోజు సామూహిక భోజనాలు ఏర్పాటు చేస్తాం. – కొమ్మెర శ్రీదేవి, డల్లాస్

మిస్ అవుతామనుకున్నా



చెన్నూర్: అమెరికాకు వెళ్లిన కొత్తలో పండగలు మిస్ అవుతాం అని అనుకున్నా. మేము డల్లాస్‌కు వచ్చి 20 ఏళ్లు అవుతోంది. ఇక్కడ తెలుగు వాళ్లు ఎక్కువగా ఉండడం నా అదృష్టం. ప్రతీ తెలుగు పండగను తప్పకుండా జరుపుకుంటాం. వినాయక చవితి, బతుకమ్మ చాలా పెద్దగా జరుపుకుంటాం. చెప్పలేనంత సంతోషంగా ఉంటుంది. బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులు జరుపుకుంటాం. – వి.సుష్మిత, డల్లాస్

ఇక్కడే పుట్టా..



చెన్నూర్: మమ్మీడాడి డల్లాస్‌లో స్థిరపడ్డారు. నేను డల్లాస్‌లోనే పుట్టి పెరిగా. ఇక్కడి పండుగల కంటే మన తెలుగు పండుగలంటే నాకు చాలా ఇష్టం. మన పండుగలను విదేశాల్లో ఉన్న మహిళలు సైతం గౌరవిస్తుంటారు. అన్నింటికంటే నాకు బతుకమ్మ పండగ అంటే చాలాఇష్టం. బతుకమ్మను తయారు చేయడంతో పాటు ఎత్తుకొని వెళ్లడం చాలా థ్రిల్‌గా ఉంటుంది. బతుకమ్మ పాటలు నేర్చుకున్నా. – పూజిత, విద్యార్థిని, డల్లాస్

ఆనందంగా ఉంది



బెల్లంపల్లి: మావారు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నేను గృహిణి. పెళ్లయిన తర్వాత అమెరికా వెళ్లాను. ఇప్పటికీ పదిహేనేళ్లవుతోంది. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు వేడుకల్లో మేమంతా మమేకవుతున్నాం. సొంతూరిలో లేమనే దిగులు తప్పా బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో అమెరికాలో జరుపుకోవడం ఆనందంగా ఉంది. మాతో పాటు అమెరికా మహిళలు కూడా బతుకమ్మ ఆడటానికి ఆసక్తి చూపుతారు. మన సంప్రదాయం ప్రకారం చీర కట్టుకుని వేడుకల్లో భాగస్వాములు అవుతారు. – తూదూరు ప్రియాంక, డల్లాస్, అమెరికా

క్లుప్తంగా

చికిత్స పొందుతూ బాలిక మృతి



అంజలి (ఫైల్)

దహెగాం: కడుపునొప్పితో బాధపడుతూ ఈనెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఐనం గ్రామానికి చెందిన కంబాల అంజలి (17)నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం నొప్పి తీవ్రం కావడంతో భరించలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దహెగాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల సూచన మేరకు బెల్లంపల్లి, మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి కంబాల శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

ధమ్మచక్ర పరివర్తనకు ప్రత్యేక రైళ్లు

ఆదిలాబాద్: ధమ్మ చక్ర ప్రవర్తన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రయాణికుల అధిక రద్దీ దృష్ట్యా నాందేడ్ రైల్వే డివిజన్ ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. నాందేడ్‌-నాగ్ పూర్ నడుమ 07085/07086 రైలు సర్వీసులను అక్టోబర్ 1, 2 తేదీల్లో నడపనున్నట్లు డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైలు ఆదిలాబాద్ మీదుగా సైతం వెళ్తుందని వివరించారు.

కాగజ్‌నగర్ మీదుగా మరో ప్రత్యేక రైలు

కాగజ్‌నగర్‌టౌన్: దక్షిణ మధ్య రైల్వే ధమ్మ పరివర్తన దివస్‌లో భాగంగా అక్టోబర్ 1 నుంచి కాగజ్‌నగర్ మీదుగా ప్రత్యేక రైలును నడుపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీదర్‌-అజ్ని, అజ్ని-బీదర్ ప్రత్యేక రైలు జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, చర్లపల్లి, జనగాం, కాజీపేట్, పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

బిస్కెట్‌షాపులో చోరీ



రేకులను తొలగించిన దొంగలు

తానూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల గోలి బిస్కెట్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుక భాగంలో ఉన్న రేకులను తొలగించి లోనికి చొరబడ్డారు. గల్లలో ఉన్న రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. షాపు యజమాని డి.నాగోరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏసీబీకి చిక్కిన టెక్నికల్ అసిస్టెంట్



ఏసీబీకి పట్టుబడిన టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్

భీమిని: మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలో ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసిన టెక్నికల్ అసిస్టెంట్ బానోత్ దుర్గాప్రసాద్‌ను ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ మధు శనివారం పట్టుకున్నారు. కన్నెపల్లికి చెందిన గోమాస కిష్టయ్య అనే రైతు క్యాటిల్ షెడ్ (పశువుల పాక) నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకున్నాడు. షెడ్డు బిల్లు రూ.70 వేలు కాగా, ఇందులో రూ.48 వేలు మంజూరు అయ్యాయి. మిగతా బిల్లు మంజూరు కావాలంటే లంచంగా రూ.10 వేలు ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు కిష్టయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం బాధితుడి నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా దుర్గాప్రసాద్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ మొదటి బిల్లు సమయంలో రూ.6 వేలు లంచం ఇచ్చానని తెలిపాడు. రెండో బిల్లుకు మళ్లీ రూ.10 వేలు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిపాడు. ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ డీఎస్పీ మధు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 9154388963, వాట్సాప్ నంబర్ 9440446106ను సంప్రదించాలని సూచించారు.

ప్రకృతిని ప్రేమించే సంస్కృతి మనది



బతుకమ్మ ఆడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రకృతితో పాటు పూలను ప్రేమించే సంస్కృతి మనదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీవో మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీక అన్నారు. అనంతరం సిబ్బందితో బతుకమ్మ ఆడారు. వేడుకల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగాధర్, అదనపు వైద్యాధికారి మనోహర్, గిరిజన శాఖ సంక్షేమాధికారి అంబాజీ, ఈఈ తానాజీ, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, సీడీపీవో ఉమా, జీసీడీవో ఛాయా, మేనేజర్ శ్యామలాదేవి, వివిధ శాఖల అధికారులు, ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూఏఈలో పూలపండుగ



బతుకమ్మతో అల్లూరి కృష్ణవేణి

నిర్మల్‌ఖిల్లా: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశంలోని దుబాయ్ అబుదాబి, షార్జా తదితర ప్రాంతాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రవాసీలు కుటుంబాలతో సహా నివసిస్తున్నారు. ఉపాధి కోసం వెళ్లి అక్కడే ఉంటున్న వీరంతా కలిసి తెలంగాణ ఆత్మకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. అక్కడి గ్లోబల్ తెలంగాణ ఫోరం సంస్థ ఆహ్వానం మేరకు నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాది, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి బతుకమ్మ వేడుకలకు అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ వాసులు వేడుకల్లో అస్తిత్వాన్ని ప్రదర్శించాలని ఆకాంక్షించారు.

ఓమన్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ



ఉత్సవాలకు హాజరైన ప్రజలు

ఖానాపూర్: గల్ఫ్ దేశం ఓమన్‌లో శుక్రవారం రాత్రి సద్దుల బతుకమ్మ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఖానాపూర్ వాసి, ఇండియన్ సోషల్ క్లబ్ ఓమన్ కన్వీనర్ గుండేటి గణేశ్, కోకన్వీనర్ నూనె లక్ష్మణ్, కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఓమన్‌లోని ఆల్ అమల్ క్లబ్‌లో వేడుకలు జరిగాయి. ఈ ఉత్సవాలకు సుమారు మూడు వేల మంది హాజరైనట్లు గణేశ్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

గంగమ్మ చెంతకు పోచమ్మ ఆభరణాలు

- అడెల్లిలో ఘనంగా ప్రారంభమైన గంగనీళ్ల జాతర



అమ్మవారి ఆభరణాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న సేవాదారులు



అమ్మవారి నగలను అనుసరిస్తున్న భక్తులు

సారంగాపూర్: నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ఆభరణాల తరలింపుతో ప్రారంభమైంది. ఆలయ సేవాదారులు ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కాలినడకన తన సోదరి అయిన గంగామాత (గంగానది) చెంతకు తరలించారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులుపట్టి గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ఇలా సారంగాపూర్ మండలంలోని అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పెల్లి, వంజర్, ప్యారమూర్, దిలావర్‌పూర్ మండలంలోని మాడేగాం, దిలావర్‌పూర్, బన్సపెల్లి, కంజర్, మల్లాపూర్ మీదుగా సాంఘ్వీ గ్రామానికి చేరుకున్నాయి. సాయంత్రం సాంగ్వి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆదివారం తెల్లవారు జామున గ్రామ సమీపంలోని గోదావరినదిఒడ్డున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడినుంచి మళ్లీ ఆయా గ్రామాల మీదుగా అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆభరణాలు తరలించి అమ్మవారికి అలంకరించిన అనంతరం ప్రత్యేక పూజలతో జాతర ముగుస్తుంది.

అడుగడుగునా నీరా'జనం'

అమ్మవారి ఆభరణాలను ఆయా గ్రామాల మీదుగా తరలించే క్రమంలో అన్ని గ్రామాల్లోనూ ప్రజలు అమ్మవారి ఆభరణాలను నెత్తిన పెట్టుకున్న సేవదారుల కాళ్లను కడిగి అమ్మవారి ఆభరణాలకు పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి బంగారం(పసుపు) సమర్పించారు. ఇదే పసుపును తీసుకుని నుదుట ధరించేందుకు భక్తులు బారులు తీరారు. గంగపుత్రులు వలలతో గొడుగులు, చాకలి వారు అమ్మవారి బొట్టు నేలరాలకుండా దారిపొడవునా బట్టలు పరుస్తూ అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఇక సఫాయి కార్మికులు పొరపాటున నేల రాలిన అమ్మవారి బొట్టును మరెవరూ తొక్కకుండా శుభ్రం చేస్తూ అమ్మవారిని అనుసరిస్తూ గోదావరి నదికి తరలివెళ్లారు.

అశేష భక్తజనం...

అడెల్లి పోచమ్మ ఆభరణాలను గంగానదిలో శుభ్రం చేసేందుకు వెళ్తున్న తరుణంలో చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఆయా మండలాలు, జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో గోదావరికి గడముంతలతో కాలినడకన తరలివెళ్లారు. ఆభరణాల శుద్ధి పూజా కార్యక్రమాల అనంతరం అక్కడే గోదావరి నదిలో స్నానాలు ఆచరించి పవిత్ర గోదావరి జలాలను తమ వెంట తెచ్చుకున్న గడముంతల్లో తీసుకుని వెళ్తారు. ఈజలాలు ఇళ్లలో, పంటపొలాల్లో చల్లుకుంటే పంటలు సమృద్ధిగా పండడంతో పాటు ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉంటారని ప్రజల ప్రగాఢ విశ్వాసం.

వర్షాలు, వరదలు లెక్కచేయకుండా...

జోరుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని యాకర్‌పెల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండగా పోలీసులు, స్థానిక గంగపుత్రుల సహకారంతో ఆభరణాలతో వచ్చిన భక్తులను వాగు దాటించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద జరగనున్న జాతరకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై ఆలయ అధికారులు, చైర్మన్ భోజాగౌడ్‌తో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

అమ్మవారికి బోనాలు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్‌లో హైదరాబాద్‌కు చెందిన మిట్టపల్లి వెన్నెల, హరీష్ స్థానికంగా ఉన్న ఫణీందర్, రఘువీరారెడ్డి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల అనంతరం తెల్లవారు జామున గోదావరిలో స్నానాలు ఆచరించి అడెల్లి ఆలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కులు సమర్పించనున్నట్లు తెలిపారు.

వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య



ఐశ్వర్య (ఫైల్)

దండేపల్లి: ప్రేమ వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు మండలంలోని పెద్దపేటకు చెందిన బొద్దు ఐశ్వర్య (17) దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇదే కాలేజీలో చదువుతున్న కొండాపూర్‌కు చెందిన కండ్లపెల్లి అజయ్ కొద్దిరోజులుగా తనను ప్రేమించాలని వెంటపడి వేధిస్తున్నాడు. అందుకు బాలిక ఒప్పుకోకపోవడంతో ఈనెల 24న కళాశాలలోనే ఇద్దరి మధ్య గొడవ జరిగింది. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పి బాధపడింది. 25న బాత్‌రూంకు వెళ్లి వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఏమైందని అడిగితే గడ్డిమందు తాగానని చెప్పింది. వెంటనే లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. అజయ్ వేధింపులు భరించలేకనే తన కూతురు తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని, అతనిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తండ్రి బొద్దు అంజయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

చెన్నూర్: పట్టణంలోని పెద్ద చెరువు కట్ట (కోటపల్లి బస్టాప్)లో ఆర్టీసీ బస్సు వెనుక టైర్ కిందపడి మహిళ కాలి వేలుకు తీవ్రగాయమైంది. వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన కోలా నవిషా అవసర నిమిత్తం శనివారం చెన్నూర్‌కు వచ్చింది. పనులు ముగించుకొని దస్నాపూర్‌కు వెళ్లేందుకు పెద్ద చెరువు వద్ద బస్సు కోసం వేచిచూస్తుంది. వేమనపల్లి బస్సు రావడంతో ఎక్కే క్రమంలో డ్రైవర్ బస్సు రివర్స్‌లో వెనుకకు రాణించాడు. దీంతో మహిళ కుడికాలు వేలుపై నుంచి బస్సు టైర్ వెళ్లడంతో వేలుకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు ఆర్‌డీసీసీ రికవరీ ఏజెంట్ల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: రూరల్ డెవలప్‌మెంట్ క్రెడిట్ కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు ఏజెంట్లు ప్రజల డబ్బులను రూ.12.50 లక్షలు కాజేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. 2017లో ప్రభుత్వ అనుమతితో ఆర్‌డీసీసీని ప్రారంభించారని, 2021–22లో 600 మందికిపైగా రైతులకు పంట రుణాలు మంజూరు చేశారన్నారు. తాంసి మండలంలోని హస్నాపూర్‌కు చెందిన కొందూరి రాకేందర్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ రైతుల వద్ద వసూలు చేసిన రూ.4 లక్షలతో పాటు సొసైటీకి చెందిన రూ.4.50 లక్షలు వాడుకున్నాడన్నారు. రాగం రమేశ్ 2022 నుంచి 2023 వరకు 60 మంది రైతుల వద్ద నుంచి రూ.4లక్షలు వసూలు చేసి సంస్థకు చెల్లించలేదన్నారు. సొసైటీ అధికారులు రుణ చెల్లింపుల కోసం రైతులను కలువగా ఏజెంట్లకు డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. విచారణలో డబ్బులు వాడుకున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ఆర్‌డీసీసీ మేనేజర్ బేలే రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దర్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.